క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

వి.కోట: వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. హెచ్ఈసీ గ్రూప్‌లో ఎకనామిక్స్ ఉర్దూ మాధ్యమంలో బోధించేందుకు ఎంఏ ఎకనామిక్స్ ఉర్దూ మాధ్యమంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. నర్సింగ్ గ్రూపుల్లో బోధించడానికి బీఎస్సీ నర్సింగ్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఆసక్తిగల వారు ఈనెల 30వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

పలమనేరులో ఐదుగురి బైండోవర్

పలమనేరు: వినాయక చవితి నేపథ్యంలో నేరచరిత్ర వున్న పలమనేరు పట్టణానికి చెందిన ఐదుగురిని బైండోవర్ చేసినట్లు స్థానిక సీఐ నరసింహరాజు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలనే ఉద్దేశంతో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. బైండోవర్ చేసిన వారిని స్థానిక తహసీల్దార్ ముందు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

చౌడేపల్లె: ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం పోలీసు స్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, యూత్ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఎవరైనా వాటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో బోల్తా

పుంగనూరు: మండలంలోని రాంపల్లె వద్ద సోమవారం కుక్కలు అడ్డురావడంతో ఆటో బోల్తా పడి ఐదుగురు గాయపడ్డారు. ఆటో ప్రయాణికులతో నేతిగుట్లపల్లె నుంచి రాంపల్లె వద్దకు వచ్చింది. కుక్కల గుంపు ఒక్క సారిగా రోడ్డుపైకి రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో నేతిగుట్లపల్లెకు చెందిన వీరమ్మ, మహేశ్వర్, ఈశ్వరమ్మ, మోదుగులపల్లెకి చెందిన మునివెంకటమ్మ, గంగులమ్మ గాయపడ్డారు.

వంకపోరంబోకు స్థలం కబ్జా!



పుంగనూరులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

పుంగనూరు: రూ.కోట్ల విలువ చేసే వంకపోరంబోకు స్థలాన్ని ఆక్రమించిన ఘటన సోమ వారం కలకలం రేపింది. పుంగనూరులోని ఆర్టీసీ బస్టాండ్, మినీ బైపాస్ రోడ్డుకు సర్వే నం.110/1లో రాయలచెరువు వంకపోరంబోకు భూమి రెండు ఎకరాలు ఉంది. దీనిపై కొందరు కన్నేశారు. తొలుత రోడ్డు కంటూ జేసీబీతో చదును చేశారు. ఆపై ఆక్రమించుకోవడం ప్రారంభించారు. ఇక్కడ ఎకరా స్థలం రూ.10 కోట్లపైనే ఉంటుంది. దీనిపై తహసీల్దార్ రామును వివరణ కోరగా తన దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆర్ఐ ఫణికుమార్, సర్వేయర్‌ను ఆదేశించారు. వారు పరిశీలించి చెరువు పోరంబోకు భూమిగా తేల్చారు. దానికి ట్రెంచ్ ఏర్పాటు చేసి ఆక్రమణ కాకుండా చూస్తామన్నారు.

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి

ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసిన రైతులకు నష్టాలు మిగులుతున్నాయి. గిట్టుబాటు ధర అందడం లేదు. ముఖ్యంగా టమాటకు ఎప్పుడు ధరలు పెరుగుతాయో.. ఎప్పుడు తగ్గుతాయో తెలియని పరిస్థితి. బంగాళాదుంప, కొత్తిమీర, క్యాబేజీ, కాలీ ఫ్లవర్ పంటలదీ అదే పరిస్థితి. దీంతో ఈ ఏడాది రైతులు కూరగాయల పంటల సాగుపై దృష్టి సారించారు. తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను ఎంపిక చేసుకుని ముందుకు వెళుతున్నారు.

- చిక్కుడు, బీన్స్, మిరప పంటల సాగు
- పెట్టుబడి తక్కువ లాభమెక్కువ



చౌడేపల్లె మండలం పెద్దూరు వద్ద సాగుచేసిన బీన్స్ పంట

చౌడేపల్లె: మండలంలోని రైతులు ప్రతి ఏటా టమాటా పంట సాగు చేసేవారు. ఈ ఏడు అధిక విస్తీర్ణంలో సాగు చేసినప్పటికీ ఊహించని రీతిలో ధరలు పతనం అయ్యాయి. దీంతో వరుసగా నష్టాలు వచ్చాయి. పెట్టుబడులు సైతం రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఈ క్రమంలో రైతులు ఇతర పంటలపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా చిక్కుడు, బీన్స్, అనప, మిరప, కాలీ ఫ్లవర్, ఆకు కూరలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా చౌడేపల్లె, నుంజార్లపల్లె, పెద్ద కొండామర్రి, సింగిరిగుంట, దొనపల్లె, నాగిరెడ్డిపల్లె, నుంజార్లపల్లె, మదుకూరు, కొత్తపల్లె, మేకలవారిపల్లె, అట్లవారిపల్లె, పక్షిరాజపురం, కాగతి, బోయకొండ తదితర గ్రామాల్లో ఐదు వందల ఎకరాల్లో సాగు చేశారు. దుక్కులు మొదలు విత్తనాల కొనుగోలు, వాటిని నాటడం, కలుపుతీయడం, ఎరువులు, క్రిమిసంహారక మందుల పిచికారీ తదితరాలకు ఎకరాకు రూ.60 వేలు ఖర్చు చేశారు. మూడు నెలల పంట కావడంతో రైతులు పోటీపడ్డారు. ఒక సారి పంట దిగుబడి మొదలైతే రెండు రోజులకు ఒకసారి పంట కోత వేయవచ్చు. వరుసగా మూడు నుంచి నాలుగు నెలల వరకు పంట దిగుబడి పొందవచ్చు. తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ఆధునిక పద్ధతులను పాటిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు నుంచి ఐదు టన్నుల పంట దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లలో చిక్కుడు, బీన్స్, అనప కాయలు కేజీ సుమారు రూ.80 నుంచి రూ.100 వరకు ధర పలుకుతోంది. చౌడేపల్లె పరిసర ప్రాంతాల్లో సాగుచేసిన పంటలను పలమనేరు, మదనపల్లె, చెన్నై, తిరుపతి తదితర మార్కెట్లకు తరలిస్తుంటారు. పంటల దిగుబడి పెరగడంతో పాటు మార్కెట్లకు ఊహించని రీతిలో దిగుబడి వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో చిక్కుడు, బీన్స్ కాయలను బస్తాల్లో నింపి తూకాల ద్వారా కేజీల లెక్కన లెక్కగట్టి విక్రయిస్తున్నారు. ఒక్కొక్క బస్తా ధర ప్రస్తుతం మార్కెట్లలో ధర రూ:750 నుంచి రూ:900 వరకు పలుకుతోంది.

కొత్త పంటలపై అవగాహన కల్పించాలి

ఆధునిక పద్ధతులతో పాటు కొత్త పంటలపై రైతులకు ప్రభుత్వం అవగాహన కల్పించాలి. పంటలు సాగుచేయడమే కష్టంగా వుంది. దీనికితోడు ఆ పంటలను మార్కెట్లకు తరలించాలంటే నానా తిప్పలు పడాల్సివస్తోంది. మార్కెట్లతోపాటు వారం వారం సంతలకూ పంటలను తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం అధికారుల ద్వారా కొత్త పంటలపై అవగాహన కల్పించి సాగు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– రమేష్‌బాబు, చిన్న ఓబునపల్లె, చౌడేపల్లె మండలం

కూలి గిట్టుబాటు అవుతోంది

మేము గతంలో టమాటా సాగు చేసేవాళ్లం. పెట్టుబడి పెట్టినా ధరలు లేక గిట్టుబాటు ధర లభించేది కాదు. ఇప్పుడు కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. కాయలు కోయడానికి కూలీలపై ఆధార పడకుండా కుటుంబ సభ్యులమే చేసుకుంటున్నాం. పంట దిగుబడులు బాగా వచ్చి మార్కెట్లలో కొంత ధరలు కూడా బాగానే వున్నాయి. కష్టానికి తగిన ఫలితం కలుగుతోంది. కూరగాయల పంటల సాగు కొంచెం నయంగా ఉంది.

–హేమంత్ కుమార్, పెద్దూరు, చౌడేపల్లె మండలం

మండపాలకు విద్యుత్ చార్జీలు చెల్లించాలి

పుంగనూరు: వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసుకునే మండపాలకు ప్రతి ఒక్కరూ విద్యుత్ చార్జీలు చెల్లించాలని ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండపాల నిర్వాహకులు విద్యుత్ చార్జీలను 250 వాట్స్‌కు రూ.500లు, 500 వాట్స్‌కు రూ.1000, అంతకంటే ఎక్కువ వినియోగిస్తే రూ.1500లు చెల్లించాలని తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఏడీ వినోద్

పుంగనూరు: స్థానిక బసవరాజ కళాశాలలో సోమవారం దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ కార్యక్రమాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 479 మంది దివ్యాంగులకు రూ.56 లక్షల విలువ చేసే ట్రై సైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వీల్ ఛైర్లు, చేతికర్రలు అందజేసినట్లు తెలిపారు. దివ్యాంగులు తమకు అవసరమైన పరికరాల కోసం దరఖాస్తు చేసుకుంటే అందజేస్తామని తెలిపారు.

ఖర్చు చేసిన కోటికి లెక్కలెక్కడ!





అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు

- ఖర్చు వివరాలిస్తామని సెలవుపై వెళ్లిన ఎంపీడీవో
- సభ ప్రారంభంలోనే వెళ్లిపోయిన ఎంపీపీ
- నోరు మెదపని ఇన్‌చార్జి ఎంపీడీవో
- వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల నిరసన

పెద్దపంజాణి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండల పరిషత్ నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.కోటికి లెక్కలు చూపాలని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. దీంతో ఎంపీడీవో జవాబు చెప్పలేక నీళ్లు నమిలారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండానే ఎంపీడీవో అధికార పార్టీ నేతలు చెప్పినట్టు రూ.కోటి వరకు ఖర్చు చేసి పనులు చేశారు. తమకు తెలియకుండానే పనులు ఎలా చేస్తారని గత మండల సమావేశాల్లో వైఎస్ ఎంపీపీ జీడీ బాబు, జెడ్పీటీసీ సుష్మకీర్తి ఎంపీడీవో బాలాజీని నిలదీశారు. దీంతో జనరల్ బాడీ గందరగోళంగా మారి రెండు దఫాలు వాయిదా పడింది. సోమవారం మండల సమావేశం నిర్వహించగా రూ.కోటికి సంబంధించిన వివరాలు ఇస్తామని చెప్పిన ఎంపీడీవో సెలవుపై వెళ్లిపోయారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శారదాదేవి మండల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రెడ్డెప్ప సమావేశాన్ని ప్రారంభిస్తుండగా వైస్ ఎంపీపీ జీడీబాబు కలుగజేసుకుని రూ.కోటి పనులకు లెక్కలు తేల్చిన తర్వాతే సమావేశం నిర్వహించాలని పట్టుబట్టారు. ఆయనకు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో ఎంపీపీ సభ నుంచి లేచి బయటికి వెళ్లిపోయారు. దీనిపై ఆగ్రహించిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైటాయించారు. కూటమి నేతల ఆదేశాల మేరకు అధికారులు అక్రమాలకు పాల్పడినందునే మూడు సమావేశాల్లోనూ పనులకు సంబంధించిన వివరాలు చెప్పకుండా దాట వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో శారదాదేవి వివరణ ఇస్తూ రూ.99.22 లక్షలకు సంబంధించి 47 పనులు చేపట్టామన్నారు. వాటిల్లో 42 పనులు పూర్తయ్యాయని, ఐదు పనులు మొదలు పెట్టలేదని తెలిపారు. అన్నింటినీ నిబంధనల మేరకే చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ–2 ఆంజమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, తహసీల్దార్ హనుమంతు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం యువత ఎదుగుదలకు గొడ్డలి పెట్టులాంటిదని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టి బొమ్మలనే పూజించాలి

పుంగనూరు: వినాయక చవితి పండుగ సందర్భంగా ఉత్సవ కమిటీల వారు మట్టి వినాయకుడి బొమ్మలనే ప్రతిష్టించి పూజించాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన బొమ్మలు నీటిలో కరగవని తెలిపారు. వాటితో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు. ఈ క్రమంలో మట్టి బొమ్మలను వినియోగించాలని సూచించారు. అదే విధంగా విగ్రహాల నిమజ్జన సమయంలో పూజా ద్రవ్యాలు, ఇతర అలంకార వస్తువులను కాల్చవద్దని తెలిపారు. వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి తెలిపారు.

అంబేడ్కర్ చిత్రపటాల వితరణ

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని సచివాలయాలు, సీఐ కార్యాలయానికి సోమవారం అంబేడ్కర్ చిత్ర పటాలను ఉచితంగా అందజేసినట్టు అంబేడ్కర్ సంఘం నాయకుడు గురుస్వామి తెలిపారు. వాటిని కార్యాలయాల్లో ఏర్పాటుచేయాలని కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, క్రాంతికుమార్, నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం

గంగవరం: మండలంలోని సరమట్లపల్లిలో సోమవారం చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కలశారాధన, హోమం, మహా గణపతి పూజ, కలశ స్థాపన, మహా కుంభాభిషేకం చేశారు. అనంతరం స్వామివారి తిరు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి మర్రిమాకులపల్లిలో మేలుదీపం, పుష్ప పల్లకి సేవ చేపట్టారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు



తరగతుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

కుప్పం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు సాధించవచ్చని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజు తెలిపారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు సోమవారం తరగతుల ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను కళాశాలకు పంపుతారని తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయక బాగా చదువుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని వసతులూ ఉన్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని ప్రగతి సాధించాలన్నారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రముఖ మోటివేషన్ స్పీకర్ నాగప్రసాద్ మాట్లాడుతూ దీక్ష, పట్టుదల, ఏకాగ్రత ఉంటేనే ఈ సమాజంలో గుర్తింపు సాధ్యమన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్, భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు మేనేజరుగా సత్యనారాయణరెడ్డి



చౌడేపల్లె: ఏపీ గ్రామీణ బ్యాంకు మేనేజరుగా సత్యనారాయణరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట బ్రాంచి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న వై.ఏడుకొండలు విజయవాడ సమీపంలోని పుత్రాల బ్రాంచికి బదిలీ అయ్యారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి లావాదేవీలు పెంచడానికి కృషి చేస్తానని తెలిపారు.

సీఏ పట్టాలు పొందిన పలమనేరు విద్యార్థులు



పట్టాల పలమనేరు విద్యార్థులు

పలమనేరు: దేశవ్యాప్తంగా 15 చోట్ల సీఏ కాన్వొకేషన్ నిర్వహించారు. బెంగళూరులో సోమవారం జరిగిన పట్టాల ప్రదానోత్సవంలో పలమనేరుకు చెందిన రిషబ్, శశిశ్రీనివాస్ సీఏ కాన్వొకేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్ పొందారు. వీరు సీఏ, సీఎంలో ఆరు జాతీయ ర్యాంకులు సాధించిన విషయం తెలిసిందే. పెద్ద కంపెనీల్లో భారీ ప్యాకేజీతో ఉద్యోగాలు సైతం సాధించారు. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వారిని స్థానికులు అభినందించారు.

భూములు కొనేవారేరి..?

వ్యవసాయం రోజురోజుకూ నష్టాలను తెచ్చిపెడుతోంది. ఈ క్రమంలోనే చిత్తూరు జిల్లాలో ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనికి తోడు బుల్లెట్ ట్రైన్ మార్గం ఏర్పాటు పై సర్వే చేసి బెంచ్ మార్కులు కూడా వేశారు. అదేవిధంగా చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించడంతో ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు మక్కువ చూపుతున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో భూముల ధరలు బాగా పెరుగుతాయని రైతులు ఆశించారు. బుల్లెట్ ట్రైన్ మార్గం ఏర్పాటు ఇప్పట్లో లేనట్టేనని తెలుస్తోంది. దీంతో రైతులు ఆశలు అడియాసలుగానే మిగిలాయి.

- బుల్లెట్ ట్రైన్, ఎక్స్‌ప్రెస్ హైవేతో ధరలు పెరుగుతాయని ఆశించిన రైతులు
- ఆసక్తి చూపని వ్యాపారులు
- పరిశ్రమలు ఏర్పాటవుతాయన్న అధికారులు
- ముందుకు రాని పారిశ్రామికవేత్తలు
- నిరాశ చెందుతున్న రైతులు



పలమనేరు మండలంలో బుల్లెట్ ట్రైన్ వెళ్లే మార్గం

పలమనేరు: పలమనేరు ప్రాంతంలోని రైతులు ఎక్కువ మంది వర్షాధారంగా వేరుశనగ సాగు చేస్తారు. తర్వాత టమాటా, బీన్స్, బంగాళాదుంప, చిక్కుడు, అనప, మిరప, కాలీఫ్లవర్, క్యాబేజీ, కొత్తిమీర తదితర పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడం, భూగర్భ అంతంతమాత్రంగా వున్నాయి. నదులు వున్నా ప్రాజెక్టులు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో నదుల్లో ప్రవహించే 200ల ఎంసీఎఫ్‌టీల నీరు తమిళనాడు ప్రాంతంలోకి వెళ్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పంటల సాగు కష్టంగా మారింది. దీనికితోడు ఆరుగాలం కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధరలు రావడం లేదు. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రతి ఏటా రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఏడాదికేడాది పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోతూ వుంది. ఈ క్రమంలో ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం, బుల్లెట్ ట్రైన్ మార్గం సర్వే పనులు చేపట్టడం, ఈ ప్రాంతాన్ని చెన్నై–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రభుత్వం ప్రకటించడంతో పరిశ్రమలు వస్తాయని అందరూ భావించారు. తద్వారా తమ భూములకు మంచి ధరలు వస్తాయని రైతులు ఆశించారు.

ఒక్కరూ ముందుకు రాలేదు

ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి భూసేకరణ పూర్తయి పనులు సైతం 70 శాతం పూర్తయ్యాయి. భూములు కోల్పోయిన రైతులకు ఆయా ప్రాంతాలను బట్టి ఎకరాకు రూ.30 లక్షల వరకు నష్ట పరిహారం ఇచ్చారు. ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ హైవేకి సమీపంలోనే బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ సుమారు 80 కిలోమీటర్ల మేర వేశారు. ఇది కర్ణాటక రాష్ట్రంలోని బేతమంగళ నుంచి పలమనేరు నియోజకవర్గంలోని వీకోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళెం, చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాల మండలాల మీదుగా ఈ మార్గం తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. దీనికి భూమి సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని కోలారు జిల్లాకు చెందిన రైతులకు కేంద్రం ఇచ్చే ధరపై నాలుగు రెట్లు అధికంగా ఇస్తామని అక్కడి అధికారులు చెప్పారు. దీంతో ఇక్కడ కూడా బుల్లెట్ ట్రైన్ మార్గంలో ఎకరాకు రూ.50 లక్షలకు పైగా నష్టపరిహారం అందుతుందని స్థానిక రైతులు భావించారు. ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పడితే పరిశ్రమలు కూడా ఎక్కువగా వస్తాయని, ప్రభుత్వ అవార్డుకు మించి భారీ ధరలతో భూములకు కొంటారని రైతులు ఆశించారు. కానీ ఎవరూ భూములు కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు.

పరిశ్రమల కోసం భూములు కొనేస్తారని...

ఎక్స్‌ప్రెస్ హైవే, బుల్లెట్ ట్రైన్ మార్గాల సమీపంలో ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పలు పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇప్పటికే పలువురు పారిశ్రామికవేత్తలు ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారని అధికారులు తెలిపారు. మరోవైపు పలమనేరు ప్రాంతంలో బెంగళూరు, చెన్నై, హొసూర్, సేలం ప్రాంతాలకు రోడ్ కనెక్టివిటీ ఉండడం, పలమనేరును రెవెన్యూ డివిజన్ చేయడం కూడా ధరల పెరుగుదలపై రైతుల్లో ఆశలు రేకెత్తాయి. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా వుండడంతో అందరూ నిరాశ చెందుతున్నారు.



బుల్లెట్ ట్రైన్ వెళ్లే మార్గంలో వేసిన బెంచి మార్కు



పలమనేరు మండలంలో వెళుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే

క్రీడాకారులకు క్రీడా దుస్తుల వితరణ



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న శరత్‌చంద్ర, హెచ్‌ఎం రేణుక

చౌడేపల్లె: దారాల ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులకు సోమవారం అదే స్కూల్‌లో పనిచేస్తున్న సైన్స్ టీచర్ అల్లూరి శరత్ చంద్ర రూ.10 వేల క్రీడా దుస్తులు అందజేశారు. పీఈటీ రాజేంద్ర సూచనల మేరకు పిల్లలను ప్రోత్సహించడానికి ఆయన సాయం చేసినట్టు హెచ్‌ఎం రేణుక పేర్కొన్నారు.

పొట్టేళ్లు చోరీ

పలమనేరు: మండలంలోని చెన్నుపల్లిలో సోమవారం రైతు యూరియా కోసం క్యూలో ఉండగా ఇంటిముందు కట్టేసిన జత పొట్టేళ్లు చోరీకి గురయ్యాయి. చెన్నుపల్లికి చెందిన గణేష్ యూరియా కోసం ఆర్‌ఎస్‌కే వద్ద క్యూలో ఉన్నాడు. ఇతని భార్య, కుమారుడు కూలి పనికెళ్లారు. ఈ క్రమంలో దొంగలు ఇంటి ముందు కట్టేసిన జత పొట్టేళ్లను దొంగలించారు. విచారణలో ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చి ఇంటి వద్ద సంచరించారని, వారే వాటిని చోరీ చేసి ఉండొచ్చని తెలిపారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొట్టేళ్ల విలువ రూ.40 వేలు ఉంటుందన్నారు.